క్లుప్తంగా

నేడు కలశ శిఖర ప్రతిష్ట

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట-బుగ్గలేటిపల్లె సమీపంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం కలశ శిఖర ప్రతిష్ట, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 8 గంటలకు స్వామి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

27న బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : మండల పరిధి తాడిగొట్ల సమీపంలోని చిన్నపల్లె యోగిశ్రీ నరసింహా స్వామి 215వ ఆరాధన సందర్భంగా ఈనెల 27న సోమవారం మధ్యాహ్నం బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గోసుల మునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. మొదటి బహుమతి రూ. 50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.15 వేలు, ఆరవ బహుమతి రూ.10 వేలు ఉంటుందన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

ముద్దనూరు : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పులివెందుల ఏడీఏ అశోక్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డితో కలసి ఆయన గురువారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అనుమతి పొందిన ఎరువులను మాత్రమే విక్రయించాలని, అన్ని రిజిస్టర్లను సక్రమంగా వుంచాలని ఆయన సూచించారు. ఈ తనిఖీలో ఆయన దుకాణాల రికార్డులను పరిశీలించారు.

పీహెచ్‌సీ తనిఖీ

పెండ్లిమర్రి : స్థానిక పీహెచ్‌సీని గురువారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వల్లి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, మందులను పరిశీలించారు. పీహెచ్‌సీలో క్షయ వ్యాధి కేసులు తక్కువ సంఖ్యలో నమోదయ్యాయని, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి క్షయ వ్యాధి కేసులు మిస్ కాకుండా నమోదు చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు.

ఆత్మహత్య చేసుకున్న దంపతుల కుటుంబ సభ్యులకు వితరణ



కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న ఏడీ శేషగిరిబాబు

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : గత ఏడాది డిసెంబర్‌లో మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన పల్లా గోవర్ధన్, పల్లా వరలక్ష్మీ దంపతులు మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. వీరి కుటుంబ సభ్యులకు జమ్మలమడుగు ట్రాన్స్‌కో అధికారులు రూ.62 వేలు నగదును గురువారం వారి గ్రామానికి వెళ్లి ట్రాన్స్‌కో ఏడీ శేషగిరిబాబు ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో ఏఈ రామాంజనేయులు, ఆర్‌వీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలిపోయిన భారీ సంప్ ప్లాస్టిక్ షీట్



అగ్నికి ఆహుతైన సంప్‌లోని ప్లాస్టిక్ షీట్

లింగాల : మండలంలోని కర్ణపాపాయపల్లె గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గండిక్షేత్ర కమిటీ సభ్యుడు ఎం.అంకాల్‌రెడ్డి అనే రైతుకు చెందిన భారీ సంప్ షీట్ అగ్నికి ఆహుతైంది. వివరాలలోకి వెళితే.. గ్రామ సమీపంలో కొండ వద్ద ఆయన పొలంలో పండ్ల తోటల సాగుకు భారీ సంప్ నిర్మించుకున్నారు. సంప్‌లో నీరు నిల్వ ఉంచుకునేందుకు సుమారు రూ.7 లక్షల విలువ చేసే ప్లాస్టిక్ షీట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు కొండకు నిప్పు పెట్టడంతో మంటలు ప్లాస్టిక్ షీట్‌కు అంటుకోవడంతో షీట్ పూర్తిగా కాలిపోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్, మాజీ ఎంపీపీ

ముద్దనూరు : మండలంలోని రాజులగురువాయిపల్లె గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం శనగల కొనుగోలు కేంద్రాన్ని యర్రగుంట్ల మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డిలు ప్రారంభించారు. రైతులకు గిట్టుబాటు ధరను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం శనగలకు కనీస మద్దతు ధర రూ.5335లు ప్రకటించిందని, ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, హరినారాయణరెడ్డి పాల్గొన్నారు.

రైతు పక్షపాతి ప్రభుత్వం

రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి



కమలాపురంలో శనగలను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి

కమలాపురం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులను అన్ని దశల్లో ఆదుకుంటోందని, ఇది రైతు పక్షపాతి ప్రభుత్వం అని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కమలాపురం మార్కెట్ యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతుల నుంచి సేకరిస్తున్న శనగలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తు నుంచి విక్రయం వరకు అన్ని దశల్లో ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు వ్యవసాయం చేయడానికి కావలసినవన్నీ అందిస్తోందన్నారు. అలాగే రైతులు పండించిన దిగుబడులు విక్రయించు కోవడంలో రైతులు నష్టపోకుండా బహిరంగ మార్కెట్ ధర కంటే అధిక ధర వెచ్చించి రైతుల ఉత్పత్తులు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. రైతు భరోసా, ఉచిత ఇన్సూరెన్స్, బీమా అన్ని ఇస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం మాత్రమేనన్నారు. ఇప్పటికీ ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోని రైతులుంటే తక్షణం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పథకాలు రైతులకు అందాలంటే ఈ-క్రాప్ బుకింగ్ తప్పని సరి అన్నారు. కాగా అక్కడున్న రైతులు శనగల కొనుగోలులో కొద్దిమేరకు నిబంధనలు సడలించేలా చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వర్షాలకు పంట కిందపడి గింజ నల్లగా మారడంతో 8–10 శాతం నల్లగింజ వచ్చిందని, నిబంధన ప్రకారం 4 శాతం నల్లగింజ ఉంటేనే దిగుబడులు తీసుకుంటున్నారని, మీరే మాకు న్యాయం చేయాలని రైతులు వేడుకున్నారు. దీనికి స్పందించిన ఆయన మార్క్‌ఫెడ్ అధికారులతో సెల్‌ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, నాఫెడ్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఒక సారి ఉత్పత్తులు కొనుగోలు చేసి రశీదు ఇస్తే ఆ సరుకు బాగాలేదని వెనక్కు వచ్చినా రైతుకు సంబంధం లేదని, డబ్బులు ఇస్తారని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, మార్కెట్ యార్డు కార్యదర్శి వరప్రసాద్‌రెడ్డి, సుబ్బన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో రైతులకు ఎంతో ప్రయోజనం

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్-నాఫెడ్ ఆధ్వర్యంలో బుడ్డ శనగ కనీస మద్దత ధర కల్పిస్తుండటం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎర్రగుంట్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుడ్డ శనగ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను చాలా ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. రైతులు వారి గ్రామాలలో ఉన్న ఆర్బీకే కేంద్రాలలో శనగల విక్రయానికి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, కమలాపురం మండల వైస్ ప్రెసిడెంట్ చెన్నకేశవరెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల సంక్షేమమే సీఎం ధ్యేయం



మాట్లాడుతున్న ఫకృబీ, వరప్రసాద్ తదితరులు

పులివెందుల టౌన్/రూరల్ : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని దూదేకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ ఫకృబీ, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. గురువారం స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీసీల సంక్షేమం కోసం సీఎం ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాలలో 14 ఎమ్మెల్సీ స్థానాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించారన్నారు. చరిత్రలో బడుగు, బలహీన వర్గాలకు ఎవరూ చేయలేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి అనేక పదవులతోపాటు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని విధాలుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉందన్నారు. అన్ని విధాలుగా బీసీలకు పెద్దపీట వేశారన్నారు. టీడీపీ హయాంలో బీసీలకు ఇన్ని పదవులు ఇచ్చిన దాఖలు లేవన్నారు. టీడీపీ నాయకుల బీసీ గర్జన గుంటూరులో నిర్వహిస్తే సభలో సీఎంను విమర్శించడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రఫీ, సంపత్, కొండయ్య, బాబు పాల్గొన్నారు.

హోంగార్డులు రక్తదానం చేయడం అభినందనీయం



రక్తదానం చేసిన హోంగార్డును అభినందిస్తున్న అర్బన్ సీఐ రాజు, ఎస్ఐలు

పులివెందుల : హోంగార్డులు విధి నిర్వహణలో ప్రజలను కాపాడటమే కాకుండా సామాజిక బాధ్యతగా రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమని అర్బన్ సీఐ రాజు తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో హోంగార్డుల విధి నిర్వహణలో నిర్వర్తించాల్సిన విధులపై శిక్షణ తరగతులలో భాగంగా స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ సీఐ హాజరై మాట్లాడుతూ రక్తదానం చేయడంవల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడినవారవుతారన్నారు. అలాగే రక్తనిధి మెడికలాఫీసర్ డాక్టర్ దివ్యశ్రీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో రక్తం కోసం ఎంతోమంది ఎదురు చూస్తున్నారని.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు హుస్సేన్‌బాషా, చిరంజీవి, ఏఆర్ ఏఎస్ఐ ఎస్.ఎం.బాషా, రక్తనిధి సిబ్బంది, సేవా సమితి అధ్యక్షుడు రాజు, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

నీత్ అయోగ్ పరమల్ ఫౌండేషన్ పరిశీలకులు వెంకటేష్



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వెంకటేష్, తదితరులు

పులివెందుల : పౌష్టికాహారం తీసుకోవడంవల్ల గర్భిణులు, బాలింతలలో రక్తహీనత దూరమవుతుందని నీత్ అయోగ్ పరమల్ ఫౌండేషన్ పరిశీలకులు వెంకటేష్ తెలిపారు. గురువారం పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టు మూడవ సెక్టార్‌లోని మంగళ కాలనీ, నగరిగుట్ట-2 అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించి కేంద్రాలకు సంబంధించిన రికార్డులను, గర్భిణులు, బాలింతల నమోదులను, వైఎస్సార్ కిట్ పంపిణీ విధానంపై వారితో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం గర్భిణులకు రక్త పరీక్షలు చేయించడం జరిగింది. ప్రతి గర్భిణీకి 11 గ్రాముల రక్తం ఉండాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభ్యమయ్యే వాటిని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణమ్మ, మాబున్ని, అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లీశ్వరమ్మ, అరుణ, ఏఎన్ఎంలు, ఎంఎస్‌కేలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ఊరట..

- రూ.10వేల లోపు పెన్షనర్లకు రేషన్‌కార్డ్ పునరుద్ధరణ
- సర్కారు నిర్ణయంపై విశ్రాంత వీఆర్వోల హర్షం

జమ్మలమడుగు రూరల్ : నెలకు రూ.10 వేల లోపు పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. గత ప్రభుత్వాలు వీరికి రేషన్‌కార్డ్‌ను మంజూరు చేయలేదు. దీంతో పేద మధ్య తరగతి వర్గాలు పొందాల్సిన పథకాలను పెన్షనర్లు కోల్పోతున్నారు. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల లోపు నెలసరి పెన్షన్‌ను పొందుతున్న విశ్రాంత ఉద్యోగులకు రేషన్‌కార్డ్ సౌకర్యాన్ని పునరుద్ధరించింది. ఈ మేరకు ఈనెల 22వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగన్‌కు రుణపడి ఉంటాం..

గతంలో కాంట్రాక్ట్ వీఆర్వోలుగా పనిచేసి అతి తక్కువ పెన్షన్‌తో జీవనం సాగిస్తున్న తమకు రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డ్‌ను పునరుద్ధరించడం సంతోషకరమని విశ్రాంత వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.ఖాదర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. పల్లె ప్రాంతంలో నివసిస్తూ సంవత్సర ఆదాయం రూ.1,20,000 పట్టణ ప్రాంతంలో నివసిస్తూ సంవత్సరానికి లక్ష 44 వేల రుపాయలు లోపు పెన్షన్ పొందుతున్న వారికి ఇది వర్తిస్తుందని ఆయన తెలిపారు. ఈ నిర్ణయంతో తమకు ఊరట కలిగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా ఉద్యమాలకు సహకరించండి



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

జమ్మలమడుగు : ప్రజలు ప్రజా ఉద్యమాలకు తమ వంతు బాధ్యతగా సహకరించాలని సీపీఎం నాయకుడు శివనారాయణ కోరారు. గురువారం ఉదయం పట్టణంలో వివిధ దుకాణాలలో ప్రజల వద్దకు వెళ్లి సీపీఎం పార్టీ ప్రజా ఉద్యమాలకు కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజల సమస్యల కోసం నిరంతరం ప్రజా ఉద్యమాలు చేస్తున్న పార్టీ సీపీఎం అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేట్ పరం చేసి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టుతుందన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

జమ్మలమడుగు : ప్రైవేట్ వైద్యులతోపాటు స్కానింగ్ కేంద్రాల యజమానులు ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ శాంతికళ సూచించారు. గురువారం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రుల డయాగ్నస్టిక్ సెంటర్‌లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలు లింగ నిర్ధారణ పరీక్షలను నిర్వహించకూడదన్నారు. ఇప్పటికే మన జిల్లాలో ఆడపిల్లల శాతం చాలా తక్కువగా ఉందన్నారు. ఆడపిల్లలను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు స్వప్న, హరి తదితరులు పాల్గొన్నారు.

కొంగల కనువిందు



ఎండిన చెట్టుపై తెల్ల కొంగలు

పులివెందుల రూరల్ : తెల్లకొంగలు ఒక్కటై ఎండిన చెట్టుపై వాలి ఉన్న చిత్రం పులివెందుల పట్టణంలోని మిట్టమల్లేశ్వర ఆలయం వెనుక వైపు కనిపించింది. ఆలయం పక్కనే వంక ఉండటంతో చిన్నచిన్న క్రిమి కీటకాల కోసం కొంగలు గుంపుగా చెట్టుపై వాలి కనువిందు చేశాయి.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



ఆంజనేయస్వామి ఆలయంలో భోజనం వడ్డిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : వైఎస్సార్ సీపీ పులివెందుల నియోజకవర్గం ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు గురువారం పులివెందులలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు పద్మనాభరెడ్డి, వీరారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి హాజరై ప్రారంభించి అన్నప్రసాదాన్ని అందరికి వడ్డించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీప్రసన్న, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని 23వ వార్డు పరిధిలోని వాటర్ ప్లాంటు వద్ద కౌన్సిలర్ కోడి రమణ ఆధ్వర్యంలో వైఎస్ భాస్కర్‌రెడ్డి జన్మదిన కేక్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేక్‌ను వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అలాగే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో కౌన్సిలర్ ఎం.మహేశ్వరరెడ్డి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

లింగాల : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలను లింగాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.వి. సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాబురెడ్డిలు స్థానిక జడలయ్య మఠం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి భారీ కేక్‌ను కట్ చేసి వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. కార్యక్రమంలో లింగాల సర్పంచ్ అనిల్‌కుమార్, గండిక్షేత్ర కమిటీ సభ్యులు అంకాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, లోపట్నూతల నాగభూషణరెడ్డి, అంబకపల్లె చెన్నకేశవరెడ్డి, పాఠశాల హెచ్ఎం నాగిరెడ్డి, వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, శివకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేముల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ భాస్కర్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కేక్‌ను ఆ పార్టీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డిలు కట్ చేశారు. ఈ సందర్భంగా వారు వైఎస్ భాస్కర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేంద్రారెడ్డి, రాఘవరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు, కరుణాకర్, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్-2023కి ఉచిత శిక్షణ

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023 పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులంతా 2023 పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. తమ కళాశాలలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యుత్తమ, అసాధారణ ఫ్యాకల్టీతో పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు, కోర్సులు, సీట్ల వివరాలు తెలుసుకోవడానికి తమ కళాశాలలోనే హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీలు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. పాలిటెక్నిక్ ద్వారా నైపుణ్య సామర్థ్యాలు మెరుగుపడి విద్యార్థులందరికీ పరిశ్రమల్లో త్వరగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పూర్తి వివరాలకు తమ కళాశాలలో సంప్రదించాలని ఆయన అన్నారు.

అరటి చెట్లు దగ్ధం

కొండాపురం : మండల పరిధిలోని వెంకయ్యకాలువ గ్రామంలో గురువారం అరటిచెట్లు దగ్ధమైనట్లు రైతు జి.వీరనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రమాదవశాత్తు 89 అరటి చెట్లు కాలిపోయినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు వాటి విలువ రూ.45 వేలు ఉంటుందని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

– మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐటీసీఎల్ సంస్థ పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. బుధవారం మాక్ డ్రిల్‌లో భాగంగా ఐటీసీఎల్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలతో ఆర్టీసీ వర్క్‌షాప్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఐటీసీఎల్ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా చూస్తారన్నారు. దురదృష్టవశాత్తు అనుకోని ప్రమాదం ఎదురైతే దానిని ఎదుర్కొనేందుకు పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం అధికారులు వారికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, కడప తహసీల్దార్ శివరామిరెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ (ఫ్యాక్టరీస్) కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువలను పరిశుభ్రంగా ఉంచాలి

నగరంలోని మురికి కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా నాలుగో డివిజన్‌లోని రాయల్ గార్డెన్, అరుంధతీనగర్, తదితర ప్రాంతాలను పరిశీలించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డిని గెలిపించండి



పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వరప్రసాద్‌లు

పులివెందుల టౌన్ : మార్చి 13న జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు. గురువారం పట్టణంలోని పలు వార్డులలో వారు పట్టభద్రులను కలసి తమ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసి సన్నిహితులతో వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, డేనియల్ బాబు, మహేశ్వరరెడ్డి, లక్ష్మీప్రసన్న, గుల్జార్, కొండల్రావు, కో ఆప్షన్ మెంబర్ రంగనాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మనాభరెడ్డి, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

వేముల : మండలంలోని గొందిపల్లె గ్రామంలో గురువారం జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డి, పీసీబీ రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డిలతో కలిసి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పట్టభద్రులు ఉన్న ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. నిరుద్యోగ యువతకు అండగా ఉండి వారి సమస్యలపట్ల చిత్తశుద్ధితో పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేంద్రారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, వాసుదేవారెడ్డి, ఆంజనేయరెడ్డి, వెంకటశివారెడ్డి, రామసుబ్బారెడ్డి, రామాంజనేయ, కరుణాకర్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ వర్రా రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవి నొప్పి, చెవిలో చీము కారుట, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కొలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జులై నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలలో భాగంగా పేదలందరికీ ఇళ్లు అన్న లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్నారని.. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు జులై నాటికి పూర్తి చేస్తామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాల సమీపంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, వీధిలైట్లు, డ్రైనేజీ, సీసీ రోడ్లు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలకు నాణ్యమైన సిమెంటు, స్టీల్ అందిస్తోందన్నారు. అందువల్ల ఇళ్ల నిర్మాణ పనులు కూడా నాణ్యతగా చేపట్టాలన్నారు. నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కొన్ని ప్రాంతాలలో జగనన్న కాలనీలో పేరుతో ఊర్లను నిర్మిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు.